# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 1, డిసెంబరు, 2014

పేద ప్రజలకు సహాయం అందించే విషయంలో ప్రభుత్వం మీన మేషాలు లెక్కించదని, డబ్బులకు వెనకాడదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. ప్రభుత్వ సంకల్పాన్ని అర్థం చేసుకుని అర్హులైన పేదలందరికి జనవరి 1 నుండి పెన్షన్లు, పెంచిన కోటా ప్రకారం బియ్యం అందించాలని ఆదేశించారు. సచివాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి పెన్షన్ల పంపిణీ, ఆహార భద్రతా కార్డుల జారీ, వాటర్‌గ్రిడ్, చెరువుల పునరుద్ధరణ, తెలంగాణకు హరితహారం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రహదారులు తదితర అంశాలపై సమీక్షించారు. గతంలో 200 ఉన్న పెన్షన్‌ను ఐదింతలు పెంచి 1000 రూపాయలు చేశామని, దీనివల్ల ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. పెన్షనర్లను ఎంపిక చేసే విషయంలో ఆలస్యం చేయడం వల్ల అనవసర ఆందోళన పెరిగిపోతున్నదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశాలు ఇలా ఉన్నాయి.

<u>పెన్షన్లు, ఆహార భద్రతా కార్డులు.</u>

- గ్రామీణ ప్రాంతాలలో లక్షన్నర, పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారందరిని పేద వారిగానే గుర్తించాలి.
- పరిమితి లోపు ఆదాయం ఉన్న వారు అంగన్‌వాడి కార్యకర్తలైనా, ప్రైవేటు ఉద్యోగస్థులైనా, ఇంకెవరైనా వారిని పేదలుగానే పరిగణించి పెన్షన్లు, ఆహార భద్రత కార్డులు అందివ్వాలి.
- డిసెంబర్ 15 లోగా పెన్షన్ కోసం అర్హుల జాబితా సిద్ధం కావాలి, డిసెంబర్ 31 లోపు ఆహార భద్రతా కార్డు అర్హుల జాబితా సిద్ధం కావాలి. జనవరి 1 నుండి కొత్త సంవత్సరంలో కొత్త కార్డులు, కొత్త పెన్షన్లు అందాలి.
- పెన్షన్లు, ఆహార భద్రతా కార్డులు జారీ కోసం నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని నియమించాలి.
- పెన్షన్లు, ఆహార భద్రతా కార్డుల జారీ విషయంలో అధికారులు పేద ప్రజల పక్షపాతిగా వ్యవహరించాలి. అర్హులను ఎట్టి పరిస్థితుల్లో విస్మరించవద్దు. ఇంకా అర్హులు మిగిలిపోతే

దరఖాస్తులు తీసుకొని విచారణ జరిపి వారికి కూడా న్యాయం చేయాలి. ప్రభుత్వంపై మరింత ఆర్థిక భారం పడినా పరవాలేదు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ

◆ ప్రతి జిల్లాలో ఎంతో విలువైన ప్రభుత్వ భూములు నిరుపయోగంగా ఉన్నాయి. వాటి వివరాలు సేకరించి హద్దులు నిర్ణయించాలి. వాటిని అధికారులు ప్రభుత్వ ఆధీనంలోకి తేవాలి.

◆ జిల్లాలోని చాలా చోట్ల ఆర్ అండ్ బి, ఐ.బి., ఫారెస్టు గెస్ట్ హౌస్‌లు ఉన్నాయి. చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. వాటికి కేటాయించిన స్థలం కూడా చాలానే ఉంది. ఉపయోగంలో లేకపోవడం వల్ల ఆ స్థలాలు, ప్రదేశాలు కబ్జాలకు గురవుతున్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయి. వాటిని స్వాధీనం చేసుకోవాలి.

◆ అవసరమయితే ఇలా గుర్తించిన భూములనే ఆదాయ వనరులుగా మార్చుకుని ఆయా జిల్లాల్లో అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయాలి.

◆ ఎస్ఆర్ఎస్‌పి, నాగార్జునసాగర్, జూరాల తదితర ప్రాజెక్టుల నిర్మాణం కోసం కూడా ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు, ఇతర అవసరాలకు చాలా భూమి కేటాయించబడి ఉంది. అవి కూడా కబ్జాలకు గురవుతున్నాయి. వాటి వివరాలు కూడా సేకరించాలి. అక్రమాలు అరికట్టాలి.

◆ అన్ని జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట నిర్మించే అవకాశాలను పరిశీలించాలి. ఒకచోట వీలు కాకుంటే కనీసం రెండు చోట్ల నిర్మించాలి. అధికారులందరూ ఒకే ప్రాంగణంలో విధులు నిర్వహించడం వల్ల పాలనా వ్యవహారాలు సులభంగా చక్క పెట్టుకోవచ్చు.

◆ పరిశ్రమలకు భూమి అవసరమయినందున ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని పరిశ్రమల కోసం రిజర్వు చేసి ఉంచాలి.

◆ రైల్వే ట్రాక్‌లు, జాతీయ రహదారులు,ఇతర ముఖ్యమైన రహదారుల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, వాటిని పరిశ్రమల స్థాపనకు అనువుగా తీర్చిదిద్దాలి.

వాటర్ గ్రిడ్

◆ ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీరు అందించే బృహత్తర తెలంగాణ వాటర్ గ్రిడ్ కార్యక్రమానికి కలెక్టర్లు సహకరించాలి.

◆ ప్రాజెక్టు రిజర్వాయర్లలో 10 శాతం నీటిని గ్రిడ్ కోసం కేటాయించినందున, నీటిని తీసుకునేందుకు వీలుగా రిజర్వాయర్లలో ఇంటేక్ వెల్స్ నిర్మించాలి.

◆ లిఫ్టు కం గ్రావిటీ ద్వారా నీటిని తరలించాలని నిర్ణయించినందున, దీనికి అనుగుణమైన కొండ ప్రాంతాలను గుర్తించాలి. ఆ ప్రాంతాన్ని గ్రిడ్ కోసం అప్పగించాలి.

◆ గ్రిడ్ కోసం పైపులైన్లు వేయడానికి అవసరమైన రైట్ ఆఫ్ వే ఇవ్వాలి.

◆ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మించడం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించాలి.

◆ ఇంటేక్ వెల్, ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి వాటి పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలి.

◆ గ్రిడ్ కోసం సర్వే నిర్వహించే సందర్భంగా ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు, రెవిన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి.

## చెరువుల పునరుద్ధరణ

◆ చాలా చెరువులను రియల్టర్లు మింగేశారు. ఆక్రమణలు కూడా వచ్చాయి. ఇప్పటికైనా చెరువుల భూముల రక్షణకు కఠినంగా వ్యవహరించాలి. చెరువు భూములను కబ్జా చేసిన వారి విషయంలో రాజీ పడవద్దు.

◆ ఫీడర్ చానల్స్ (కట్టు కాలువ) కూడా చాలా వరకు దురాక్రమణకు గురయ్యాయి. ఈ విషయంలో వెంటనే స్పందించాలి. ఆక్రమణ దారులపై కఠినంగా వ్యవహరించి కట్టు కాలువలను పునరుద్ధరించాలి.

◆ చెరువుల్లో నీరు ఖాళీ కాగానే పునరుద్ధరణ పనులు ప్రారంభించాలి. ఏ చెరువు ముందు ఖాళీ కాగానే ఆ చెరువు పనులే ముందు చేపట్టాలి.

◆ చెరువు మట్టితో పాడు పడిన బావులను నింపాలి. చెరువు మట్టిని పొలాలకు తరలించాలి.

◆ చెరువు భూముల విషయంలో కోర్టు వివాదాలు కూడా ఉన్నాయి. ఈ విషయాన్ని సమీక్షించాలి. కార్యదర్శుల కమిటీ పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి.

◆ ఏక్‌సాలా, ఏక్ ఫజలా పట్టాలపై కూడా ప్రభుత్వం త్వరలోనే ఒక స్థిరమైన నిర్ణయం తీసుకుంటుంది.

◆ చెరువు అందాన్ని పెంచేందుకు చెరువు చుట్టూ సిల్వర్ ఓక్ చెట్లను పెంచాలి. ఈ పని నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలోనే జరగాలి.

## హరిత హారం

- ఇప్పటి వరకు ఎన్ని నర్సరీలు పెట్టారు, అక్కడ మొక్కల పెంపకం ఎలా ఉందో కలెక్టర్లు పరిశీలించాలి.
- హరిత హారం పై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలి.
- రోడ్ల ప్రక్కన ఆకర్షణీయంగా ఉండే పూల చెట్లను ఎక్కువగా నాటాలి.
- జాతీయ ఉపాధి హామి పథకాన్ని వినియోగించుకోవాలి. మెటీరియల్ కాంపోనెంట్ నుండి మట్టిని తొలగించాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, రహదారుల ప్రక్కన మొక్కలను విరివిగా నాటాలి.
- పొడి వాతావరణ ఉన్న ప్రాంతాల్లో బోర్ వెల్స్ ఏర్పాటు చేసి మొక్కలకు నీరు అందించాలి.

## రహదారులు

- రహదారుల నిర్మాణం, మరమ్మత్తులు, మెరుగుదల పనులను పెద్ద ఎత్తున చేపట్టినందున పనులు వేగంగా జరిగేలా చూడాలి.
- కలెక్టర్లు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలి.
- రోడ్ల కోసం పెద్ద ఎత్తున కంకర అవసరం కాబట్టి కొత్త స్టోన్ క్రషర్లకు అనుమతి ఇచ్చే అధికారాన్ని కలెక్టర్లకు బదిలీ చేస్తాం.
- ప్రభుత్వ భూముల్లో ఉన్న కొండ ప్రాంతాలను స్టోన్ క్రషర్ కోసం కేటాయించాలి. దీనివల్ల భూ ఉపరితలాన్ని చదును చేసి పరిశ్రమల కోసం కేటాయించడం సాధ్యమవుతుంది.

---

సిపిఆర్ఓ టు సిఎం